
నగరంలో కురుస్తున్న భారీ వర్షం


పొట్టేపాళెం ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షపునీరు


పొగతోట ప్రధాన వీధిలో నిలిచిన వర్షపునీరు


పొగతోట వీధుల్లో నిలిచిన మురుగునీటిలో మహిళల అగచాట్లు

# నగరం.. జలమయం

- మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం
- రహదారుల్లో పొంగి పొర్లుతున్న డ్రెయినేజీ నీరు
- హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదుల వెల్లువ

నెల్లూరు(బారకాసు) : వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజులుగా నెల్లూరు నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లు, వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టినా పలుచోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. కాలువలు ఉప్పొంగుతున్నాయని, ఇళ్లలోకి నీరు చేరుతోందని, రోడ్లు మునిగిపోయాయని పెద్ద సంఖ్యలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలోనే అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**యుద్ధ ప్రాతిపదికన చర్యలు**

నగరంతో పాటు శివారులోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్‌ఎంసీ) అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. జేసీబీల సహాయంతో ఎక్కడైతే నీరు ప్రవహించే అవకాశం లేదో అక్కడ ప్రత్యామ్నాయంగా కాలువలు తీయడం వల్ల నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా నగరంలోని పలు రైల్వే అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వ లేకుండా మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బయటకు తోడేసే చర్యలు చేపట్టారు.

**ప్రత్యేక నిఘా అవసరం**

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా ట్రంకురోడ్డు, గాంధీనగర్, మూడుహాళ్ల రోడ్డు, పొగతోట, ఆత్మకూరు


తల్పగిరి కాలనీలో వర్షపునీటిలో వాహనాలు


బుజబుజ నెల్లూరు హైవేపై వర్షపునీటిలో వెళ్తున్న ఆటో

బస్టాండ్, విజయమహల్‌గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి, మద్రాసు బస్టాండ్, దర్గామిట్ట, బుజబుజనెల్లూరు, ఆర్టీసీ కాలనీ, తల్పగిరి కాలనీ, వైఎస్సార్ నగర్, చంద్రబాబునగర్, జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాలతో పాటు నీటి పోటు అధికంగా ఉన్న ప్రాంతాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నగరంలోని పలుచోట్ల డ్రెయినేజీ నుంచి మురుగునీరు పొంగి రహదారిపైకి ప్రవహిస్తోంది.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

భారీ వర్షాలకు నగర ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మురుగు కాలువలు పొంగి పొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త తొలగిస్తున్నామని చెప్పారు. కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరితే పంపింగ్ చేయడానికి మోటార్లతో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. మ్యాన్ హోల్స్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. తాగునీటి శుభ్రతకు చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు కోర్డినేషన్ చేస్తున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకూడదని, తమకు సమాచారం అందిస్తే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే హెల్ప్‌లైన్ నంబర్ 0861-2356777, 0861-2316777కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నీటి పారుదలకు ప్రత్యేక చర్యలు


మినీబైపాస్ రోడ్డులో సహాయక చర్యలను పరిశీలిస్తున్న కమిషనర్

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలో ఎక్కడా నీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ సూర్యతేజ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న సహాయక చర్యలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రమాదకరమైన స్థితిలో ఉన్న హోర్డింగ్‌లను తొలగించామని, ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తున్నట్లు తెలిపారు.


చెరువును తలపిస్తున్న తల్పగిరి కాలనీ


చేపల మార్కెట్‌లో వాహనదారుల ఇక్కట్లు


సండే మార్కెట్‌లో వ్యాపారుల అవస్థలు


పొగతోటలో పొంగిన డ్రెయినేజీలో పేరుకున్న చెత్తకుప్పలు


పొగతోట వీధిలో మురుగునీటిలో వెళ్తున్న మహిళ


ఆర్టీసీ కాలనీలో నిలిచిన వర్షపునీటిలో చేపలు పడుతున్న స్థానికులు

## క్లుప్తంగా

### దోషులను శిక్షించాలి

నెల్లూరు రూరల్ : అన్నమయ్య జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని పేల్చి వేసేందుకు కొందరు కుట్ర చేశారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. హిందూ ఆలయాలకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతకు ముందు విగ్రహాలు మాత్రమే ధ్వంసం చేశారని, ఇప్పుడు ఏకంగా ఆలయాల కూల్చివేతకు పాల్పడుతున్నారన్నారు.


### బాధితులను ఆదుకోవాలి

నెల్లూరు రూరల్ : భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిరుపేదలు మరింత కష్టాలు పడుతున్నారని, చేతి వృత్తులు, కూలి పనుల్లేక అల్లాడుతున్నారని, వారికి రూ.5 వేలు, నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు ఇవ్వాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. రైతులను కూడా ఆదుకోవాలని కోరారు.

### రైతులకు అవగాహన

నెల్లూరు సిటీ : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం దొంతాలి, అంబాపురం గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ నాగమోహన్, సహాయకుడు విజయసారథి పాల్గొన్నారు.

### ముస్లింల నిరసన



నెల్లూరు(బృందావనం) : మహ్మద్‌ప్రవక్తపై యతి నర్సింగ్‌నంద సరస్వతి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై నగరంలో ముస్లింలు బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జెండావీధిలోని మసీదు నుంచి పెద్దబజారు, ఆచారివీధి, నెహ్రూబొమ్మ, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ మీదుగా వీఆర్సీ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అతనిపై కేసు నమోదు చేయాలని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్లిం నాయకులు సమీ, ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ, డీఎల్‌టీసీ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు (టౌన్) : స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐలు, డీఎల్‌టీసీ ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శిగా ఏడుకొండలు, కోశాధికారిగా ఏవీఎస్.శారద, జిల్లా ఉపాధ్యక్షులుగా గౌస్‌బాషా, విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా దేవదానం, వరప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసాచారి, రామారావు, రామ్మోహన్, రామలింగంను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులుగా శ్యామ్‌ప్రసాద్, వంశీకృష్ణ వ్యవహరించారు.


ఐటీఐ, డీఎల్‌టీసీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు

## పునరావాస కేంద్రంలో పరిశీలన

నెల్లూరు(బారకాసు) : నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న పీఎన్నార్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని నగర మేయర్ పొట్లూరి స్రవంతి బుధవారం సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత బాధితులకు ఆమె భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. రంగనాయకులపేట పీఎన్నార్ స్కూల్‌కు దాదాపు 50 కుటుంబాలను తీసుకొచ్చారన్నారు. మొత్తం 13 పునరావాస కేంద్రాల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లతో పాటు మెడికల్‌కు సంబంధించి ఏఎన్ఎం, ప్రాథమికంగా అవసరమయ్యే మందులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.


పునరావాస కేంద్రంలో ఉన్న వారికి భోజనం వడ్డిస్తున్న మేయర్ స్రవంతి

## కోతకు గురైన పెన్నాబ్రిడ్జి


పాత చెక్‌పోస్టు వద్ద దెబ్బతిన్న పెన్నాబ్రిడ్జి


టిడ్కో ఇళ్లకు వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపునీరు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో ఉన్న పెన్నాబ్రిడ్జి చివర కోతకు గురైంది. కోవూరు నుంచి నెల్లూరువైపు వెళ్లే మార్గంలో పాత చెక్‌పోస్టు వద్ద పెన్నాబ్రిడ్జి చివర దెబ్బతినడంతో అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. 53వ డివిజన్ గాంధీగిరిజన కాలనీ, వెంకటేశ్వరపురం పెట్రోల్ బంకు గుంత సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో మోటార్లతో తోడివేస్తున్నారు. 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ, టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

### బాలుడి పరార్

నెల్లూరు(క్రైమ్) : మార్కులు తక్కువ వచ్చాయని తండ్రి మందలించడంతో ఓ బాలుడు ఇంటి నుంచి పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఫత్తేఖాన్‌పేట శఖిలం వారి వీధిలో ఎ.సురేఖ– కార్తీక్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు గౌతమ్ మూలాపేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని ఈనెల 12వ తేదీన బాలుడిని తండ్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు బాలుడి కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో తల్లి సురేఖ బుధవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 10న రాష్ట్రస్థాయి నృత్యపోటీలు

నెల్లూరు(బృందావనం) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నృత్యపోటీలను నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. నగరంలోని పురమందిరంలో నవంబరు 10వ తేదీన జరుగనున్న నృత్యపోటీలకు ఆహ్వాన పత్రికలను బుధవారం సుబేదారుపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు సన్మానంతో పాటు 'నాట్యరత్న', 'నాట్యమయూరి' బిరుదులను అందజేయడం, ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలను అందిస్తామన్నారు. ఆసక్తి గల కళాకారులు 77299 42543 నంబరును సంప్రదించాలని కోరారు. సమావేశంలో నాగినేని ప్రభాకర్, ఎన్.జగన్‌మోహన్, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

### వాల్మీకి మహర్షి జయంతి నేడు

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్ర పండగ వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను స్మరిస్తూ జ్యోతి ప్రజ్వలన, వాల్మీకి చిత్రపటానికి పూలమాల అలంకరణ జరుగుతాయని, అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లాలోని వాల్మీకి బోయ కుల నాయకులు, పెద్దలు, బీసీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోవూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలు డైకస్‌రోడ్డులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ బుచ్చిరెడ్డిపాళెం పట్టణ, మండలాధ్యక్షులు టంగుటూరి మల్లికార్జున్‌రెడ్డి, చర్లో సతీష్‌రెడ్డి, ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, విడవలూరు మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు కడివేటి శ్రీనివాసులురెడ్డి, కడివేటి అన్వేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పార్టీ నేతలు

## ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు (టౌన్) : స్థానిక ఇందిరమ్మ కాలనీ, ఈశ్వరపురం, గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లోని తుఫాన్ బాధితులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి ఆహార పొట్లాలు, తాగునీటి ప్యాకెట్లను రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, శ్రీహరిరెడ్డి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, బ్లడ్ సెంటర్ కన్వీనర్ సురేఖ పాల్గొన్నారు.



## సెట్నెల్ సీఈఓకు సన్మానం

నెల్లూరు(అర్బన్) : సెట్నెల్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో పీహెచ్‌పీ, రూడ్స్ అసోసియేషన్ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ సంఘాలు సెట్నెల్ సంస్థతో కలిసి పాలుపంచుకున్నాయన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ జిల్లా నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సెట్నెల్ సిబ్బంది పాల్గొన్నారు.



## లోతట్టు ప్రాంతాల్లో పరిశీలన

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతాలైన కొండ్లపూడి కెనాల్, గొల్లకందుకూరు, పొట్టేపాళెం, ములుమూడి ప్రాంతాల్లో రూరల్ తహసీల్దార్ లాజరస్, ఇరిగేషన్ ఏఈ మహేష్ బుధవారం పర్యటించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు లాజరస్ పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

